నేడు ప్రయివేట్ విద్యా సంస్థల బంద్ : అపుస్మా

ప్రజాశక్తి-కడప అర్బన్ : విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ పాఠశాలలో 25 శాతం పేద, బడుగు, బలహీన వర్గాల, మైనార్టీ విద్యార్థులను చేర్చుకోవాలని ఉందని, దీనిని అమలు చేయడంలో లోపాలు ఉన్నాయని, ఇందుకు నిరసనగా ఈ నెల మూడవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు విద్యా సంస్థలు బంద్ పాటిస్తున్నట్లు అపుస్మా రాష్ట్ర చైర్మన్ ఎం.వి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్ట ప్రకారం మొదట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని, అక్కడ సీట్లు సరిపోకపోతే ఎయిడెడ్ పాఠశాలలో చేర్పించాలని, అక్కడ సీట్లు సరిపోకపోతే చివరికి ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వీర్యం చేస్తూ ప్రయివేట్ పాఠశాలలను ప్రోత్సహించే విధంగా విద్యా హక్కు చట్టం అమలు చేస్తున్నట్లు ఉందన్నారు. పేద విద్యార్థులను చేర్పించుకోవడంలో తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

- గురుకులం ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తోట్లపల్లెలో రూ.1.23 కోట్లతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలుర)లో అభివద్ధి పనులను కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్‌పి అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో 1988వ సంవత్సరంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మొట్టమొదటి గురుకుల పాఠశాల తీసుకువచ్చారన్నారు. ఆ గురుకుల పాఠశాలను బ్రహ్మంగారి పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఘనత ఎన్‌టిఆర్‌తోనే మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సాధ్యమైందన్నారు. మండలంలోని తోట్లపల్లిలో నూతన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల తీసుకురావడానికి 2017లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వద్దకు వెళ్లి మాట్లాడి తీసుకువచ్చామని తెలిపారు. మైదుకూరు నియోజవర్గంలోని ఐదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని తెలిపారు. రూ.36 కోట్లతో అలకనూరు ప్రాజెక్టుకు కృషి చేయాలని ముఖ్యమంత్రిని కోరుతామని పేర్కొన్నారు. బ్రహ్మంగారిమఠం అభివద్ధి కోసం రూ.6 కోట్లు కేటాయించమని కలెక్టర్‌ను అడగగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం తరగతి గదులను ప్రారంభించిన కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన వారు ఎనిమిదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఏ సబ్జెక్ట్ అంటే మీకు ఇష్టం, స్కూల్ బ్యాగ్స్, పాఠ్యపుస్తకాలు అందరికీ అందాయా, ఒక్కొక్క క్లాస్ రూమ్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. వంద శాతం అడ్మిషన్స్ పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో పిల్లలకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టండి అంటూ అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రుల ఆశయాలకు

గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అనుగుణంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వారు ఎంచుకొన్న రంగంలో ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొనిరావాలన్నారు. దేశానికి, రాష్ట్రానికి మంచి నాయకులు ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలన్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో బాగా రాణించాలని, పట్టుదలతో ఇష్టంగా చదవాలన్నారు. రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్, సమగ్ర శిక్ష ఎపిసి నిత్యానంద రాజు, డ్వామా పీడీ ఆది శేషారెడ్డి, డిసిఒ ఉదయశ్రీ, బద్వేల్ ఆర్‌డిఒ చంద్ర మోహన్, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపిడిఒ వీరకిషోర్, ఎంపిపి వీరనారాయణరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎల్లటూరి సాంబశివరెడ్డి, ఎస్సార్ శ్రీనివాస్ రెడ్డి, కానాల మల్లికార్జునరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు సన్న పూరి శ్రీను, పూజ శివయ్య యాదవ్, చిలమల నారాయణ, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ రవీంద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

- అర్ధనగ్న ప్రదర్శనలో నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం కోటిరెడ్డి సర్కిల్ వద్ద నుంచి కార్పొరేషన్ వరకు అర్ధ నగ్న ప్రదర్శన, బిక్షటన చేశారు. ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను చిన్నచూపు చూస్తుంది అనడానికి నిదర్శనం తల్లికి వందనం కేవలం ఒకే సెక్షన్‌లో ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్నా పారిశుధ్య కార్మికులకు తల్లీకి వందనం ఇచ్చి ఇంజినీరింగ్ కార్మికులకు ఇవ్వకపోవడం బాధాకరమని చెప్పారు. కేవలం రూ.13,087 తీసుకుంటున్న ఇంజినీరింగ్ కార్మికుల అమలు చెయ్యక పోవడం ప్రభుత్వ చేతగాని తనమని చెప్పారు. 4న ధర్నా చౌక్ దద్దరిల్లేలాగా ధర్నా చేస్తామని పేర్కొన్నారు. మా న్యాయమైన సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, ఇత్తడి ప్రకాష్, సుబ్బారాయుడు, గురువయ్య, వెంకటేష్, గోవర్ధన్, రాంమోహన్‌రెడ్డి, చిన్న

ర్యాలీ, అర్ధనగ్న ప్రదర్శనలో నాయకులు

ఓబుళయ్య, మహేశ్వరరెడ్డి, రామ్ చెన్నయ్య, ఆంజనేయులు, చెంద్రారాయుడు, సోమిరెడ్డి వీర్రా నారాయణ, బద్రి, సుబ్బలక్షుమ్మ, లక్ష్మి దేవి, హరి నాయక్, పాల కొండా రాయుడు, అజాముద్దీన్ బాషా, ప్రదీప్ కుమార్, రాంబాబు, రమేష్ బాబు, వెంకట సుబ్బయ్య సిద్దయ్య, చిన్న రెడ్డయ్య, శివ, కార్మికులు పాల్గొన్నారు.

కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలపై చర్యలు

- యుటిఎఫ్ నాయకుల డిమాండ్

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యాశాఖ చేపట్టిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీల మ్యాన్యువల్ కౌన్సెలింగ్‌లో ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించవలసిన స్థానాల కంటే అధికంగా కేటాయించి, బదిలీల చట్టం-2025ను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలు డి.గంగిరెడ్డి, సావిత్రమ్మపై చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు ప్రశ్నించారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఈ నెల 9వ తేదీ డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం డిఇఒ కార్యాలయంలో డిఇఒ షేక్ షంషుద్దీన్‌కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన ధర్నా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలు వ్యవహరించిన తీరు వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన బదిలీల చట్టం-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరికి ఒక పాఠశాలలో 40 శాతానికి మించి పోస్టులు కేటాయించకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలు చట్టాన్ని బేఖాతాలు చేస్తూ ప్రిఫరెన్షియల్ కేటగిరికి ఇష్టారాజ్యంగా పోస్టులు కేటాయించారన్నారు. బదిలీల కౌన్సిలింగ్‌లో కడప, ప్రొద్దుటూరు మండలాల పరిధిలో నిబంధనల కంటే ఎక్కువ పోస్టులను ప్రిఫరెన్షియల్ కేటగిరీలో చూపించి జనరల్ కేటగిరిలో ఉన్నవారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎంఇఒల నిర్లక్ష్యం వల్ల దాదాపు పది మంది జనరల్ కేటగిరి ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎంఇఒల నిర్లక్ష్య వైఖరి వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులతో పాటు ఒత్తిడికి గురయ్యారని పేర్కొన్నారు. అధికారులు జరిగిన తప్పును గుర్తించి, కౌన్సెలింగ్ ను రద్దుచేసి తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, తప్పును సరిచేయకుండా అర్ధరాత్రి తర్వాత బదిలీల ప్రక్రియను కొనసాగించారన్నారు. ఈ విషయంపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టగా ఉపాధ్యాయులకు జరిగిన నష్టాన్ని సవరించడంతోపాటు, నిర్లక్ష్యానికి, అక్రమాలకు బాధ్యులైన కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలపై తక్షణమే చర్యలు తీసుకుంటామని డిఇఒ హామీ ఇచ్చారన్నారు. ఎంఇఒల వైఖరిపై కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్‌కు సైతం యుటిఎఫ్ పక్షాన ఫిర్యాదు చేశామన్నారు. బదిలీల కౌన్సెలింగ్ పూర్తయి 20 రోజులు దాటినా ఇంతవరకు ఎంఇఒలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో కూడా ఇలాంటి సంఘటనలు పునరావృత్తమయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి, బదిలీల చట్టాన్ని ఉల్లంఘించిన కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 10వ తరగతి పరీక్షల, మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పారితోషికాన్ని చెల్లించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. పరీక్షలు, మూల్యాంకనం పూర్తయి 3 నెలలు కావస్తున్నా చెల్లింపులు చేపట్టకపోవడం తగదన్నారు. తక్షణమే పరీక్షల, మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లింపులకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ రెండు డిమాండ్లపై ఈనెల 9వ తేది డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

టెండర్ వేసిన వారికే గదులు కేటాయించాలి

- ఆర్‌టిసి ఈడికి సిపిఎం నాయకుల వినతి

ఆర్‌టిసి ఈడికి వినతిపత్రం అందజేసిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప ఆర్‌టిసి బస్టాండులో 6 నెలల కిందట టెండర్లు వేసిన వారికి ఇంతవరకు గదులు చూపెట్టకుండా ఆర్‌టిసి ఆర్‌ఎం, ఈడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ విమర్శించారు. బుధవారం కడప ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు సిపిఎం నగర కమిటీ ప్రతినిధి బృందం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదుల విషయంలో ఆర్‌టిసి ఉన్నతాధికారులు పేద, బడుగు, బలహీన వర్గాలకు తగిన న్యాయం చేయాలని కోరారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఆర్‌టిసి టెండర్లలో స్రవంతి అనే దళిత మహిళ పాల్గొని పి.17ఎ, పి17సి రూములను టెండర్లలో దక్కించుకున్నారని పేర్కొన్నారు. టెండర్ అలాట్‌మెంట్ ఆర్డర్ ఆర్‌టిసి యాజమాన్యం జారీ చేసిందన్నారు. వారికి ఇప్పటివరకు కొలతలు వేసి రూములు చూపెట్టకుండా ఆర్‌టిసి ఆర్‌ఎం, ఈడి, సివిల్ ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూన్నారని చెప్పారు. జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో సైతం ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయన్నారు. చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారి పట్ల రీజినల్ మేనేజర్ ఇలా వ్యవహారించడం ఏమాత్రం సరికాదన్నారు. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్న షాపుల నిర్వాహకులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం మరింత దారుణమన్నారు. కిందిస్థాయిలో కల్పించుకుని న్యాయపరంగా దక్కాల్సిన రూములను ఆయా టెండరు దారులకు దక్కేలా ఆర్‌టిసి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులను కలుపుకుని ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, నగర నాయకులు నరసింహ, గోవిందు, బాధితులు పి.స్రవంతి, ఎస్.కదిరున్, భాగ్యమ్మ, జోసెఫ్ పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

వైద్యులపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-గోపవరం

మండలంలోని గుండం రాజుపల్లె యానాదికాలనీకి చెందిన పెంచలమ్మ మృతికి కారకులైన ఎఎన్ఎం నర్సు, డాక్టరును వెంటనే సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బండి జకరయ్య డిమాండ్ చేశారు. గుండంరాజుపల్లిలో ఉన్న బాధితుల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 29వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు పెంచలమ్మ ఇంటివద్దే మూడో సంతానం ప్రసవమైందన్నారు. ఆ తర్వాత ఆమె ఆరోగ్యం క్షీణించడంతో భర్త తొట్టిగారిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న నర్సు, డాక్టరు కడపలో ఉన్నారంటూ ఫోన్‌లో సూచనలు తీసుకుని చికిత్స కొనసాగించిందని చెప్పారు. రక్తస్రావం ఎక్కువ అవ్వడం అవసరమైన ఇంజక్షన్ ఆస్పత్రిలో లేకపోవడంతో ఇంజక్షన్ కోసం టౌన్‌కి పంపించడం ఆలస్యం కావడంతో పరిస్థితి విషమించి ఆమె కోమాలోకి వెళ్లిందని పేర్కొన్నారు. నర్సు ఆ పేషెంట్‌ని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లండని చెప్పడంతో అక్కడ నుండి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుని వెళ్లే లోపు చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర ఔషధాలు, వైద్యుల అందుబాటులో లేకపోవడం కారణంగా గర్భిణి ప్రాణాలు కోల్పోయిందన్నారు. ఇది వైద్య విభాగం నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. డాక్టర్ హాజరుకాకుండా ఫోన్ ద్వారా సూచనలు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టి, డ్యూటీలో ఉండే నర్సులు ఎటువంటి ఆధారాలు లేకుండా వైద్యం అందించరాదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై డిఎంహెచ్ఒ సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిధుల దుర్వినియోగంపై గ్రామ సభలో రచ్చ

ప్రజాశక్తి-కాశీనాయన

మండలం కత్తెరగండ్ల గ్రామ పంచాయతీలో నాలుగు సంవత్సరాల నుంచి లక్షలాది నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామసభలో ప్రజలు పంచాయితీ అధికారులను నిలదీశారు. నాలుగు సంవత్సరాల నుండి పంచాయతీకి లక్షలాది నిధులు మంజూరయ్యాయని, దేనికి ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలని నిలదీశారు. కాలువకు పైపులు వేసినందుకు రూ.60 వేలు ఎలా ఖర్చు అయిందని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి ముళ్ళ కంచ వేసినందుకు కనీసం రూ.50 కూడా ఖర్చు కాదని, అలాంటి దానికి రూ.1.50 లక్షలు ఎలా ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత గ్రావెల్ రోడ్డుకు రూ.3.80 లక్షల నిధులు ఎలా డ్రా చేశారన్నారు. మరొకటి గ్రావెల్ రోడ్డుకు రూ.2 లక్షలు డ్రా చేశారని గ్రీన్ అంబాసిడర్ల ఒకరోజు కూడా చెత్త బండిని ఉపయోగించలేదన్నారు. గ్రామ పంచాయతీలో వీధిలైట్లు లేవని, ఎక్కడపడితే అక్కడ మురుగు నీరు, సిసి రోడ్లు లేవన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో ప్రజలు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పంచాయతీ నిధులను గ్రావెల్ రోడ్ల రూపంలో జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. వీటన్నింటికీ సమాధానం చెప్పలేక గ్రామ సభలో నుంచి అధికారులు వెళ్లిపోయారు. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే సమగ్ర నివేదికతో కలెక్టర్‌ను కలుస్తాం చెప్పారు. డిప్యూటీ ఎంపిడిఒ రహీంను వివరణ కోరగా గ్రావెల్ రోడ్డుకు రూ.3.80 లక్షలు డ్రా చేసిన విషయం నాకు తెలియదని మిగిలిన విషయాలు అడిగితే సరైన సమాధానం చెప్పకుండా మా దగ్గర అన్ని రికార్డులు ఉన్నాయని సమాధానం దాటవేశారు దీనిపై పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేసి చూద్దాం.

సమ్మెను జయప్రదం చేయండి : వ్య.కా.స

ప్రజాశక్తి-కడప అర్బన్

గ్రామీణ పేదలు వలసలు నివారించడానికి తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, చట్టాన్ని కాపాడుకోవడం కోసం ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాలోని వ్యవసాయ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు కోనేటి నరసయ్య కోరారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పనికి వెళ్లే వారికి మంచినీళ్లు, పనిముట్లు, సమ్మర్ అలవెన్సులు, మజ్జిగ, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, 5 కిలోమీటర్లు దాటితే రాను పోను ఆటో ఛార్జీలు ప్రతివారం ప్లేస్ స్లిప్పులు బట్వాడా ఇచ్చేవారని పేర్కొన్నారు. ఇప్పుడు ఇవన్నీ తీసేశారని చెప్పారు. అడిగితే ప్రతిదానికి పైనుంచి నిధులు రావడంలేదని అధికారులు చెబుతున్నారని విమర్శించారు. పని ప్రదేశాల్లో ఆన్‌లైన్ మస్టర్ వేయాలన్నారు. లేకపోతే చేసిన పనిని నమోదు కాదని చెప్పారు. కొన్నిచోట్ల నెట్ సరిగా లేకపోతే గంటల తరబడి మస్టర్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. 3, 4 నెలలు గడిచినా ఉపాధి చేసిన పనులకు డబ్బులు చెల్లించడం లేదన్నారు. ఒక ప్రక రూ. లక్షల కోట్లు అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు రాయితీల పేరుతో డబ్బులు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం పేదలు పనిచేసే ఉపాధి హామీ చట్టానికి మాత్రం నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రతి ఏటా నిధులు తగ్గించడం వల్ల జాబ్ కార్డులు, పని దినాలు తగ్గిపోతున్నాయన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలన్న, ఉపాధి చట్టాన్ని విస్తరించాలని ఏడాదికి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకు కూలీ రూ.600 ఇవ్వాలని తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5లక్షలు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ అమలు చేయాలని కోరారు. 11 సంవత్సరాల నుంచి భూ పంపిణీ నోచుకోవడం లేదని, గ్రామీణ పేదలకు భూ పంపిణీ అమలు చేయాలని పేర్కొన్నారు. భూ కబ్జాదారుల భూములను స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. సాగులో ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి గ్రామాలలో వలసలు నివారించడానికి ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు భూ పంపిణీ అమలు చేయాలని కోరారు. నివాసం ఉన్న పేదల ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో బద్వేల్, గోపవరం బి.కోడూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, అట్లూరు తదితర మండల కేంద్రాలలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూముల్లో ఇండ్లు వేసుకుని నివాసమున్న పేదలకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. వెంటనే నివాసం ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్య.కా.స. నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- కెవికె సమన్వయకర్త వీరయ్య

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య అన్నారు. బుధవారం ఉటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వారు ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఒంటిమిట్ట మండల పరిధిలోని చింతరాజుపల్లి గ్రామంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీరయ్య పాల్గొని మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చునని, ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. నాణ్యత పరమైన ఉత్పత్తులను పెంపొందించడం కోసం రైతులు ఎంతో కృషి చేయాలని సూచించారు. కె.వి.కె సస్యరక్షణ డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ రైతులకు ట్రైకోడెర్మా సూడోమోనాస్ వినియోగం, ప్రధాన పంటలలో కాషాయల ద్వార పురుగు, తెగుళ్ళ యాజమాన్యం, జిగురు అట్టలు లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలు, పక్షి స్థావరాలు, కంచె పంటలు, ఎర పంటలు, జీవనీయంత్రణ పద్ధతుల ద్వారా సస్యరక్షణ గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి అరుణ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను వారే నిర్ణయించి అమలు చేస్తే బాగుంటుందని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస మాట్లాడుతూ అరటిలో రకాలు, మొక్కల ఎంపిక, గెల యాజమాన్యం, సహజ పద్ధతులలో పోషక యాజమాన్యం, పురుగు, తెగుళ్ల యాజమాన్యం గురించి, పసుపులో విత్తిన తరువాత నుండి కోత దాకా యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం : డిసిసి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కావాలంటే నాయకత్వం ఎంతో అవసరమని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి పేర్కొన్నారు. కడప నగరంలోని 50 డివిజన్లలో డివిజన్, వార్డు ఇన్‌ఛార్జి పదవులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆ మేరకు నియామకాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను గౌరవించి, రాజకీయ ఆశయాలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కొత్త ముఖాలకు నాయకత్వంలో అవకాశమివ్వాలన్న ఉద్దేశంతో పార్టీ సంస్కరణలు చేపట్టుతోందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోగా తమ దరఖాస్తులను డిసిసి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - కడప

నాయకులకు, కార్యకర్తలకు ఏదైనా కష్టం వచ్చినా పార్టీ అండగా నిలుస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. వైసిపి జిల్లా మైనార్టీ జనరల్ సెక్రటరీ నియమితులైన జమీల్ బుధవారం అంజాద్‌బాషాను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ వైసిపి ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ అని, ఈ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి 2.0లో న్యాయం చేయనున్నట్లు తెలిపారు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏదైనా కష్టం వచ్చినా, పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అజ్మతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, నాయకులు ముస్తాక్, జాకీర్ హీన, ఐటి విభాగం నగర అధ్యక్షుడు నందలూరు ఫయాజ్, అఫ్రోజ్, అబ్దుల్లా, మురళి, అస్లం పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ పద్మ

బిఇడి పరీక్షలు ప్రారంభం

- తనిఖీ చేసిన రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బిఇడి కళాశాలల రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాల, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. 4,551 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం నుంచి ప్రతి కేంద్రానికి పరిశీలకులను పంపామని, ప్రత్యేకంగా హైపవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని జమ్మలమడుగు, సి.కె.దిన్నె మండలాలు ఎంపికైనందువలన మహిళలకు రివాలింగ్ ఫండ్, స్త్రీ నిధి, బ్యాంకు రుణాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో జరిగిన విధ్వంసం నుండి అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నామన్నారు డ్వాక్రా మహిళలను లక్షాధికారులు చేయడమే కాకుండా, సమాజంలో మహిళలకు ఒక గుర్తింపు తీసుకొచ్చింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. చింతకొమ్మదిన్నె డ్వాక్రా మహిళ సంఘాలకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎస్సీ, ఎస్టీలకు రివాలింగ్ ఫండ్ 100 సంఘాలకు వెయ్యి మంది సభ్యులకు రూ.10 లక్షలు, స్త్రీ నిధి రుణాలు 23 సంఘాలకు గాను 105 మంది సభ్యులకు రూ.65 లక్షలు మరియు బ్యాంకు రుణాలు 129 సంఘాలకు 1165 మంది సభ్యులకు రూ.90 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి రాజ్యలక్ష్మి, మండల ఎపిఎం వెంకటరమణ రాజు, మండల టిడిపి కన్వీనర్ కృష్ణారెడ్డి, మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం మోహన్ బాబు, రాజారావు, శంకర్‌రెడ్డి, రవి, పీరు ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

'సుపరిపాలన తొలి అడుగు' ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ 18వ వార్డు నంద్యాల రోడ్డు రాజీవ్ నగర్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, టిడిపి నాయకులు ధనపాల జగన్, రవి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బిఎన్ శ్రీనివాసులు, యుగంధర్, కోన సుబ్బారావు, అమర్నాథ్, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. మైదుకూరు నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షుడిగా ఖాజీపేట మండలం పాటిమీదపల్లెకు చెందిన తుట్టే రాము యాదవ్, ఐటిడిపి మండల అధ్యక్షుడిగా మిడుతూరు గ్రామానికి చెందిన చిత్రాల ఏసుపాదం నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు బుధవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాబూ.. బనకచర్ల ఆలోచనను విరమించుకో..

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఇప్పటికైనా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి సూచించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు ఆచరణ సాధ్యం కాదని, రాష్ట్రానికి గుది బండ అవుతుందని తొలినుంచి కాంగ్రెస్ చెపుతున్నట్లు తెలిపారు. తెలంగాణాకు కాళేశ్వరంలా ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం-బనకచర్ల గుది బండ అవుతుందని తులసిరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే టిడిపి, వైసిపి, కూటమి ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యం వల్ల రాష్ట్రం అప్పుల్లో ఉందన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల రాష్ట్రం శాశ్వతంగా అప్పుల ఊబిలో కూరుకుపోతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుత అంచనా రూ.81,900 కోట్లు అన్నారు. నిధులు లేక తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలిగొండ వంటి సాగునీటి ప్రాజెక్టులు దశాబ్దాలుగా పూర్తిగాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడంపై దృష్టి పెట్టాలని చంద్రబాబుకు సూచించారు. ఏడాది పాలన సుపరిపాలన అని కూటమి ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి పాలనది దుష్పరిపాలన అన్నారు. సుపరి పాలన అందించడం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు.

క్రైం కార్నర్

ఎర్రగుంట్లలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక మార్కెట్ యార్డులో పాత గోడౌన్ వెనుకవైపున ఒక వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. కడప నగరంలోని మాసాపేటకు చెందిన హసీనాకు ప్రొద్దుటూరు పట్టణం గురువయ్య తోట ఏరియాలోని జాఫర్‌తో అక్రమ సంబంధం ఉండేది. సదరు మహిళను కలిసేందుకు జాఫర్ మంగళవారం కడపకు వెళ్లాడు. స్థానికులు అక్కడ అడ్డుకున్నట్లు తెలిసింది. అయితే హసీనా సోదరుడు షేక్షావలికి ఎర్రగుంట్లలో కుక్కలను పట్టే పని కల్పిస్తానని జాఫర్ పిలుచుకొచ్చాడు. ఈ క్రమంలో ఇరువురు మద్యం సేవించారు. గంజాయి సేవించేందుకు ఇరువురు పాత మార్కెట్ యార్డ్ గోడౌన్ వెనుకవైపు వెళ్లారు. పెళ్లయి కూడా మా చెల్లెలితో సంబంధం పెట్టుకుంటావా అని షేక్షావలి జాఫర్‌ను ప్రశ్నించాడు. మద్యం మత్తులో అక్కడ ఇరువురు వాదులాడుకున్నారు. ఒక రాయితో జాఫర్, షేక్షావలిని బలంగా కొట్టాడు. ఈ సంఘటనలో షేక్షావలి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ కేసును కొన్ని గంటలలోపు పోలీసులు ఛేదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వర్లు పరిశీలించారు.

అదుపు తప్పి కారు బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

మృతి చెందిన ప్రభాకర్

కడప-తాడిపత్రి ప్రధాన రహదారి శెట్టివారిపల్లె సచివాలయం సమీపంలో బుధవారం సాయంత్రం కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గుర్రం ప్రభాకర్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ప్రభాకర్ ఫ్లెక్సీల వ్యాపారం చేస్తున్నాడు. ప్రభాకర్ మరో వ్యక్తి తేజేశ్వర్ కలిసి సొంత పని నిమిత్తం తాడిపత్రి నుంచి కారులో కడపకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవింగ్ చేస్తున్న ప్రభాకర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న తేజేశ్వర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన తేజేశ్వర్‌ను 108లో ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక పాప ఉంది. సిఐ దస్తగిరి సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

ఎడ్ల బండిని ఢీకొన్న కూరగాయల ఆటో

- తల్లి, కుమారుడికి తీవ్ర గాయాలు, రిమ్స్‌కు తరలింపు

ప్రజాశక్తి - వేంపల్లె

కడప-పులివెందుల రహదారిలోని తంగేడుపల్లె వద్ద బుధవారం తెల్లవారుజామున ఎడ్ల బండిని కూరగాయల ఆటో ఢీకొంది. ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామానికి చెందిన వెనుగొండు వెంకట ప్రసాద్ వేంపల్లెలోని సంఘం వీధిలో నివాసం ఉం టున్నారు. బతుకుదెరువు కోసం సొంత ఆటోలో కూరగాయలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వ్యాపార నిమిత్తం బుధవారం వేంపల్లెలోని కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసుకొని అమ్ముకునేందుకు తల్లి వెనుగొండు లక్ష్మిదేవితో కలిసి వెంకట ప్రసాద్ ఆటో స్వయంగా నడుపుతూ బయ ల్దేరారు. తంగేడుపల్లె గ్రామ సమీపంలోకి ఆటో రాగానే అటుగా వస్తున్న ఎడ్ల బం డిని అదుపుతప్పి కూరగాయల ఆటో ఢీకొంది. ఆటో బోల్తా పడింది. ఈ ప్రమా దంలో వెంకట ప్రసాద్, లక్ష్మిదేవి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారి వద్ద ఉన్న ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చి కడప రిమ్స్‌కు తరలిం చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పన్ను వసూళ్లతో పంచాయతీల అభివృద్ధి

ముద్దనూరులో ఇళ్ల కొలతలను పరిశీలిస్తున్న డిపిఒ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ముద్దనూరు

పన్నులు సకాలంలో వసూలు చేసి పంచాయతీకి ఆదాయాన్ని పెంచి, అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. ఉప్పలూరు, ముద్దనూరు పంచాయతీల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఉప్పలూరులో చెత్త సేకరణ, పరిసరాల శుభ్రత, నీటి ట్యాంక్, పలు రికార్డులను, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వాటర్ ట్యాంక్ రోజూ శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. హరిత రాయబారులు ప్రతి రోజు ఇంటింటికి తిరిగి తడిపొడి చెత్త వేరుగా సేకరిస్తున్నారా లేదా అని రాజ్యలక్ష్మి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్‌ల ద్వారా వస్తున్న నీరు శుభ్రంగా ఉన్నాయా అని ప్రజలతో ఆరా తీశారు. ఉప్పలూరులో తాగునీరు సదుపాయం, పారిశుధ్యపు పనులు సక్రమంగా నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి కె.విజయ భారతిని డిపిఒ సంతృప్తి వ్యక్తం చేసి, అభినందించారు. ముద్దనూరు సచివాలయంలో రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. పలు వీధుల్లో తిరిగి రీ అసెస్మెంట్ ఇళ్లకు సంబంధించి ఇంటి కొలతలు రికార్డులు తనిఖీ చేశారు. దాదాపు 74 ఇళ్లను కొలతలు వేసి నివేదిక పంపాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వీరభద్రుడును ఆదేశించారు. పన్నులు అమలు, వసూళ్లు ఏ విధంగా చేస్తున్నారని ముద్దనూరు కార్యదర్శి లక్ష్మి నరసింహులును అడిగి తెలుసుకున్నారు. సేకరించిన చెత్త, వ్యర్థాలను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ఉప్పలూరు సర్పంచ్ పల్లా గంగయ్య, మాజీ ఉప సర్పంచ్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

అవగాహన కల్పిస్తున్న ఎఒ నాగార్చన

ప్రజాశక్తి - ఖాజీపేట

చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని ఏరువాక సమన్వయకర్త అంకయ్య సూచించారు. తక్కువ పెట్టుబడి అవుతుందన్నారు. రైతులు ముందుకు రావాలని అంకయ్య కోరారు. మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో బుధవారం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు ప్రశాంతి, ఎఒ నాగార్చన పంటల సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వల్ల ఆరోగ్యానికి మంచిదన్నారు. చిరుధాన్యాలకు డిమాండ్ అధికంగా ఉందన్నారు.

చాపాడు : వరి, ఇతర పంటలు సాగు చేసే రైతులు సాధారణ ఎరువుల కంటే సూక్ష్మ పోషకాలు జింక్, సల్ఫేట్ వంటి వాటిని దుక్కిలో ఉపయోగించాలని ఎఒ దేవి పద్మలత తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద గురువలూరు, చిన్న గురువలూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియా, రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారన్నారు. వాటి స్థానంలో ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న సూక్ష్మ పోషకాలను ఉపయోగించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సందర్భంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులకు రైతుల నుంచి డిమాండ్ ఉందని వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పెద్ద గురువలూరు సర్పంచ్ రాజేష్‌కుమార్ రెడ్డి, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

చాపాడు (మైదుకూరు) : మైదుకూరు మండలంలోని వనిపెంట రైతు సేవా కేంద్రం పరిధిలోని వనిపెంట, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఈ.బాల గంగాధర్‌రెడ్డి, కేవికె శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

వేముల : స్థానిక వేల్పుల, బెస్తవారిపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు మాట్లాడుతూ ప్రధానంగా ఉల్లి పంటలో ఊదా రంగులో మచ్చలు ఏర్పడి ఎండిపోయినచో తెగులు నివారణకు క్లోరోతోలోనిల్ 2.5 గ్రామ్ లేదా కార్బెండజం 2 గ్రామ్ లీటర్ నీటి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సూక్ష్మధాత లోప నివారణకు జింక్ సల్ఫేట్ 50శాతం రాయితీతో, కావలసిన రైతులు చీనీ పంటలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ సురేష్, విహెచ్ఎ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

వల్లూరు : అంబవరం గ్రామ పంచాయతీ పరిధిలో కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడి నరసింహారెడ్డి మాట్లాడుతూ వరిలో సస్యరక్షణ, కాలిబాటలు, ప్రభుత్వ పథకాలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ సహాయకుడు దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : బొందలకుంట గ్రామంలో బుధవారం ఎడిఎ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఎఒ వెంకట కృష్ణారెడ్డి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో విత్తన శుద్ధి తప్పక చేయాలన్నారు. రైతులు సహజ సిద్ధ పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేయాలన్నారు. వ్యవసాయ పరికరాలు కావలసిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నుజహత్, ముని భూపాలుడు, శ్రీదేవి, శైలజ, రమణయ్య, జమున, పుష్పావతి, రైతులు పాల్గొన్నారు.

లింగాల : రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల సారవంతమైన నేలలను కోల్పోతారని ఎఒ రమేష్ సూచించారు. మండల పరిధిలోని దొండ్లవాగులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది హరిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'వరద'కు ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి చేసిన ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతమైందని, అభిమానులు, నాయకులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కుమారుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి తెలిపారు. కనీసం ఒక పది రోజులు ఎవ్వరూ రావద్దని సూచిస్తున్నా మన్నారు. జనంతో వెంటనే కలవడం వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చే అవ కాశం ఉంటుందన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలంటే విశ్రాంతి అవసరమన్నారు.

కూటమి ప్రభుత్వానిది కక్షపూరిత రాజకీయం

యవజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు రహంతుల్లా ఖాన్

వేంపల్లె : కూటమి ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయం చేయడం సరైంది కాదని వైసిపి యవజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే వైసిపి నాయకుడైన శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చి వేశారన్నారు. ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటుంటే ఇప్పుడు చెరువు భూమి అంటూ కూల్చివేయడం దారుణమన్నారు.

వరుణ్ స్కూల్‌పై సమగ్ర నివేదిక ఇవ్వాలి : డిఇఒ

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మండల కేంద్రంలోని వరుణ్ స్కూల్‌పై సమగ్ర నివేదిక ఇవ్వాలని డిఇఒ షంషుద్దీన్ ఎంఇఒ పుల్లయ్యను ఆదేశించారు. పాఠశాల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బి) నాయకుల ఫిర్యాదు మేరకు బుధవారం డిఇఒ ఎంఇఒతో కలిసి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బి నాయకులు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వరుణ్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక చోట అనుమతి ఉంటే మరోచోట పాడుబడ్డ సత్రంలో క్వాలిఫైకానీ వారితో తరగతులు నిర్వహిస్తున్నారని, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ మేరకు అధికారులు పాఠశాలలో ఉపాధ్యాయుల అర్హతలు, తరగతి గదులు, టాయిలెట్స్ పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బి నాయకులు మనోజ్, సూహేష్ పాల్గొన్నారు.

'గండి'లో కొన్ని టెండర్లకు మాత్రమే ఆమోదం

త్వరలో రద్దయిన వాటికి తేదీని నిర్ణయిస్తాం : ఇఒ

ప్రజాశక్తి - చక్రాయపేట

టెండర్లలో పాల్గొన్న పాలకమండలి సభ్యులు, టెండర్‌దారులు

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో ఈ ఏడాది జరిగే శ్రావణ మాస ఉత్సవాలకు బుధవారం దేవస్థాన కార్యనిర్వహణ అధికారి జే వెంకటసుబ్బయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్లు నిర్వహించారు. స్వాగత తోరణాలు ఏర్పాటుకు అడుగు రూ.270 చొప్పున మణికంఠ టెండర్ దక్కించుకున్నారు. శ్రావణమాస ఉత్సవాల్లో ఐదు శ్రావణ శనివారాల్లో ఫోటోలు, వీడియోలు రికార్డ్ చేసి ఇచ్చేందుకు రూ.31,300 దేవరగట్టుపల్లె సిద్దయ్య దక్కించుకున్నారు. శ్రావణమాస శనివారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించడానికి భజంత్రీలు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున శ్రీనివాసులు టెండర్ దక్కించుకున్నారు. పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్లు, బారికేడ్ల టెండర్లను రద్దే చేశామని ఇఒ వెంకటసుబ్బయ్య తెలిపారు. మళ్లీ టెండర్లు నిర్వహించేటప్పుడు వేంపల్లి, పులివెందల, ప్రొద్దుటూరు, కడప సప్లయిస్‌కు తెలియజేసి సీల్డ్ టెండర్లు నిర్వహిస్తామన్నారు. అనంతరం దేవస్థాన పాలకమండలి సభ్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చిం చారు. శ్రావణ మాసంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. కార్యక్రమంలో గండి దేవస్థాన మాజీ చైర్మన్లు వెంకటస్వామి, భాస్కర్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

- మరోసారి మానవత్వం చాటుకున్న వేల్పుల రాము

ప్రజాశక్తి - వేముల

వేల్పుల గ్రామానికి చెందిన వైసిపి మండల నాయకుడు లింగాల రామలింగారెడ్డి (రాము) తన తండ్రి లింగాల గంగిరెడ్డి జ్ఞాపకార్థం శవపేటికను భద్రపరచే ఫ్రీజర్ బాక్స్‌ను మరోసారి వితరణ చేశారు. లింగాల పర్వతమ్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష వెచ్చించి ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. కటింగ్ షాప్ గంగాధరకు బాడీ ఫ్రీజర్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా వేల్పుల రాము మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఫ్రీజర్ అవసరం ఉన్నవాళ్లు ఈ నెంబర్‌ను 96421 61887 సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వేల్పుల గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రీజర్‌ను వితరణ చేసిన దాతలు

IN THE COURT OF THE HON'BLE II ADDL., JUNIOR CIVIL JUDGE, KADAPA

E.P.No.298/2022

O.S.No.574 /2020

Eruvuri Mallikarjuna, S/o Kondaiah, D.No.42/253, Up Stairs, N.G.O., Colony, Kadapa City.

...Decree Holder

Vs

1. Lingala Rabiya, W/o L. Khader Basha, Lingala Mahabbob Basha S/o L. Khadher Basha Having died his L.Rs., 2 to 5.
2 Lingala Mahaboob Jan, W/o Late Mahaboob Basha 3. Lingala Reshma W/o Razak,
4. Lingala Mahammad Ali, S/o Late L. Mahaboob Basha 5. Lingala Muskan, D/o Late Mahaboob Basha
All R/at D.No.37/1086-2, Nehru Nagar, Kadapa City.

...Judgment Debtors

వేలం ప్రకటన

పై దావాలో డిక్రీ హోల్డర్ తన డిక్రీ బాకీ మొత్తము వసూలు కోరి J.Dr. యొక్క షెడ్యూల్ దాఖలు ఆస్తిని జప్తు చేయించి వేలంనకు తెచ్చియున్నారు. సదరు వేలం తేదీ: 17.07.2025 పై కోర్ట్ ఎదుట ఉదయం 10:30 నిమిషంలుకు బహిరంగముగ వేలం వేయబడును.

SCHEDULE

House Property situated in Kadapa District, Kadapa Sub-District, Urban/Rural of Chinna Chowk Village fields in an extent of 145.200 square yards situated in S.No.62/2 Bearingdoor Nos. 37/1086-1 & 37 /1086-2 Nehru Nagar bounded by: East -Road, West- Site belongs to Raja Naidu, North- House belongs to B. Subbarayadu, South- Site belongs to others.

//కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు//

జి. జ్ఞాన ప్రసాద్,

అడ్వకేట్ & నోటరీ, కడప.

రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

I.A.No. 275/2024

I.A.No. 752/2020

I.A.No. 751/2020 in O.S.No. 515/2020

చింతలపల్లి రాజాగోపాల్, S/o లేట్ సి.గురప్ప, హిందు, వయస్సు 65 సం॥లు, వ్యాపారం, డోర్ నెం.5/1719, గీతా ఆశ్రమము వీధి, ప్రొద్దుటూరు టౌన్, వైఎస్ఆర్ జిల్లా.

...పిటిషనర్/వాది

Vs

సోమలిఖిత, D/o Late సోమ కొండయ్య, W/o Not Know హిందూ, వయస్సు 26 సం॥లు, R/o D.No.4/877-2, చౌడమ్మ దేవాలయం వీధి, సూపర్ బజారు రోడ్డు, ప్రొద్దుటూరు టవున్, వైఎస్ఆర్ జిల్లా.

...రెస్పాండెంటు/ప్రతివాది

4వ ప్రతివాదికి దావా సమను మరియు నోటీసులు

వాది పేరున మీ తండ్రి గారు అయిన కీ.శే. సోమ కొండయ్య వ్రాయించి ఇచ్చినటువంటి విక్రయ అగ్రిమెంటు పైన పై తెలిపిన శ్రీ కోర్టు యందు దావా నా పైన మరియు ఇతరులపైన వేసి వున్నాడు. ఇందులో టెంపరరీ ఇంజక్షన్ కోరి I.A.No.752/2020 పిటిషన్‌ను దాఖలు చేసియున్నాడు. ఇందులోని దావా పెండింగ్‌లో వుండగా విక్రయించిన్నాను. వారిని అనగా కొన్నవారిని దావాలో ప్రతివాదులుగా చేర్చామని I.A.No.275/2024 పిటిషన్ దాఖలు చేసినాడు. ఇందు లో నీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల 14.7.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై తెలిపిన శ్రీ కోర్టు యందు హాజరయి తెలుపుకోవలయును. లేనంతట రాజశ్రీ కోర్టు వారు దావా మరియు పిటిషన్‌లను నీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 14.7.2025

E.V.SUDHAKAR REDDY, B.Com.,B.L.,

S.NOORULLAH, B.Sc.,B.L.,

Advocates, PRODDATUR

విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న మునిరాజారెడ్డి

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి

ప్రజాశక్తి - ముద్దనూరు

మార్చిలో నిర్వహించిన పది పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ఉత్తమ స్థానాలు సాధించిన 10 మంది విద్యార్థులకు గజ్జల చెన్నారెడ్డి, అచ్చమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎన్ఆర్ఐ ప్రభాకర్‌రెడ్డి రూ.లక్ష నగదు ప్రోత్సాహక బహుమతులు వితరణ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మాజీ ఎంపిపి కుడుముల మునిరాజారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నగదు బహుమతి, మెమెంటో అందజేశారు. అనంతరం మునిరాజారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగేశ్వర నాయక్, వైసిపి నాయకులు గుర్రప్ప, మండల అధ్యక్షులు నడమల శ్రీధర్‌రెడ్డి, కొండాపురం మండల అధ్యక్షులు డాక్టర్ చింతా నవజ్యోత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఓబులేస్ పాల్గొన్నారు.

మంచి చేస్తే గుర్తుండిపోతారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రజలకు మంచి చేస్తే ఏ ఉద్యోగి అయినా చిరకాలం గుర్తుండిపోతారని పలువురు పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని ఎపిఐఐసి రాష్ట్ర మజీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి, సర్పంచ్ రాణమ్మ పేర్కొన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలోని సచివాలయ సిబ్బంది బదిలీపై వెళుతున్న సందర్భంగా బుధవారం వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

యామవరం ఫీడర్ లైన్లు మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ముద్దనూరు విద్యుత్ ఉప కేంద్రం ఎఇ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యామవరం, చెన్నారెడ్డిపల్లి, ఉమ్మారెడ్డిపల్లి, చింతకుంట గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, ప్రజలు, రైతులు సహకరించాలని ఎఇ కోరారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు వంద శాతం రాయితీ

ప్రజాశక్తి - లింగాల

డ్రిప్ ఇరిగేషన్ పథకం ద్వారా అయిదు ఎకరాల్లోపు ఉన్న ఎస్‌సి, ఎస్‌టి రైతులకు వంద శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైక్రో ఇరిగేషన్ పీడీ వేంకటేశ్వరరెడ్డి సూచించారు. మండల పరిధిలోని గుణకణపల్లెలో బుధవారం పర్యటించారు. రైతుల పొలంలో డ్రిప్ మోటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఐఓ ఏసునాథరెడ్డి, జైన్ డీలర్ల వెంకట నారాయణ రెడ్డి పాల్గొన్నారు

సింహాద్రిపురం : బిందు సేద్య పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపి పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కడప నాగయ్యపల్లె, దుద్దేకుంట, అంకాలమ్మ గూడూరు గ్రామాలలో జైన్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరికరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పది ఎకరాల భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్పు పరికరాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హతగల ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం డ్రిప్పు పరికరాలను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పండ్ల తోటలు, కూరగాయలు, చీనీ తోటల సాగు రైతులకు డ్రిప్పు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

అటవీ సంపద పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఒ హేమాంజలి

అటవీ సంపద పరిరక్షణకు కృషి చేస్తానని ముద్దనూరు అటవీశాఖ ఇన్‌ఛార్జి రేంజర్ ఆఫీసర్ హేమాంజలి తెలిపారు. ఇక్కడ ఉన్న ఎఫ్ఆర్ఒ ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఓగా బుధవారం భాద్యతలు చేపట్టారు. ఉన్నతాధికారులు ప్రొద్దుటూరు అటవీశాఖ రేంజర్ ఆఫీసర్ హేమాంజలికి ఇన్‌ఛార్జి భాద్యతలు అప్పగిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్ర చందనం అక్రమ రవాణా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అడవి జంతువుల సంరక్షణ, మొక్కల పెంపకానికి పాటుపడతానని పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను శుద్ధిచేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌ను మున్సిపల్ అధికారులు శుద్ధి చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు కోరారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్‌లోని వాటర్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడ ఉన్న వాటర్ ప్లాంట్ చాలా మందికి ఉపయోగపడుతుందన్నారు. వేసవికాలంలో వాటర్ ప్లాంట్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, వాటర్ ప్లాంట్‌ను మూసేశారన్నారు. గడిచిన నెలపైగా అవుతున్న మంచినీటి ప్లాంట్‌ను శుద్ధి చేయలేదన్నారు. దాన్ని ఉపయోగంలోకి తీసుకరావాలనే ఆలోచన అధికారులకు కలగడంలేదని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు వినయ్ కుమార్, అబ్రహం, ఆటో కార్మికులు నాగరాజు, ప్రభాకర్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

రాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్ట్ కడప & ప్రొద్దుటూరు

G.W.O.P.No. 21/2025

1. కంభం కమలాకర రెడ్డి, తండ్రి నడిపి పుల్లా రెడ్డి, వయస్సు 46 స.లు, వృత్తి వ్యవసాయం 2. కంభం శ్రీ ముఖ రెడ్డి, తండ్రి కంభం కమలాకర రెడ్డి, మైనర్, వయస్సు 14 స.లు, విద్యార్థి.
3. కంభం శ్రీ వర్షిక రెడ్డి, తండ్రి కంభం కమలాకర రెడ్డి, మైనర్, వయస్సు 11 స.లు, విద్యార్థి అందరూ D.No. 5/25. డి కొత్తపల్లె గ్రామం, దిగువపల్లి పోస్ట్, వల్లూరు మండలం, కడప జిల్లా నివాసితులు.

...పిటిషనర్లు

Vs

Nill. ...రెస్పాండెంట్

పై దావాలోని 2వ మరియు 3వ పెటిషనర్లు మైనర్స్, వారి తరపున గార్డియన్‌గా 1వ పెటిషనర్‌ని అపాయింట్మెంట్ కొరకు మరియు కింది షెడ్యూల్ దాఖలా మైనర్స్‌కు సంబంధించిన ఆస్తిని విక్రయం పై G.W.O.P. No. 21/2025 పైన కోర్ట్‌లో దాఖలు పరచినారు. కనుక ఎవరికైనా ఆక్షేపణలు వున్నా యెడల పైన తెలిపిన కోర్ట్ యందు 22.08.2025న ఉదయం 10:30గ.లకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవచ్చును. లేనియెడల పరోక్షంగా తీర్మానం చేయబడును.

షెడ్యూలు

A-Schedule

కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కనులాపురం సబ్ జిల్లా, లేబాక గ్రామపంచాయతీ గ్రామ పొలం నందు సర్కార్ పుంజి సర్వేనెంబర్ 63 లో రెండు ఎకరాలు out of 5 ఎకరాలు లేదా 0-810 హెక్టర్స్ దిశలు: తూర్పు: ఖమ్మం విజయగోపాల్ రెడ్డి పొలము, పడమర: రస్తా, ఉత్తరము: శ్రీ వర్షిక రెడ్డి పొలము, దక్షిణము: కంభం నడిపి పుల్లారెడ్డి యొక్క మిగులు భూమి.

B-Schedule

కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కమలాపురం సబ్ జిల్లా, లేబాక గ్రామపంచాయతీ గ్రామ పొలం నందు సర్కార్ పుంజి సర్వేనెంబర్ 641 లో రెండు ఎకరాల పదహారు సెంట్లు లేదా 0-875 హెక్టర్స్ దిశలు: తూర్పు: ఖమ్మం విజయగోపాల్ రెడ్డి పొలము, పడమర: రస్తా, ఉత్తరము: సుధ శ్రీరాముల రెడ్డి పొలము, దక్షిణము: శ్రీముఖ రెడ్డి పొలము

//By Order of the Court//

ఎన్.ప్రవీణ్ కుమార్ రెడ్డి

పిటిషనర్ల అడ్వకేట్, సెల్: 9494073076